కథ

# బామ్మగారి మంచం

''ఛీ...ఛీ... దీన్ని చూస్తేనే చాలు... జీవితమంటే విరక్తి కలుగు తోంది. సంసారం మీదే రోత పుడుతోంది'' అనుకుంది సుందరి నిర్వి కారంగా.

అప్పటికి ఆమె అలా అనుకోవడం ఏ వెయ్యోసారో... వెయ్యినొక్కోసారో.

సుందరి సుందరవదనంలో మబ్బులా కమ్ముకున్న విచారాన్నీ, గూడుకట్టుకున్న గుబులునూ పరికించి చూశాడు వామనరావు.

సుందరి ఎందుకింత దిగులుగా ఉందోనన్న సంగతి తెలిసీ, ఏమీ చేయలేని తన అసమర్థతకు తనను తానే నిందించుకున్నాడు అతను.

''అవును పాపం! దీన్ని ఎంతో నీట్‌గా... మరెంతో అందంగా... తీర్చిదిద్దాలని సుందరి ఆశ... తపన... కానీ ఈ జన్మకి ఆ ఆశ నెరవేరే సూచనలు లేవు.

ఇంతకీ... ఆ 'ఇది'... ఏమిటో తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది కదూ!

ఆ 'ఇది' అక్షరాలా ఒక మం...చం... అండీ... మంచం

నాలుగుకోళ్లతో, నవారు బిగించి అల్లిన పందిరి పట్టెమంచం.

''ఛ... వెధవ మంచవాని... వెధవ మంచం... బామ్మగారి మంచం'' అక్కసుగా అనుకుంది మరోసారి.

ఇంతకీ సుందరికి ఆ మంచాన్ని చూస్తే ఎందుకింత చిరాకో... దాన్ని 'బామ్మగారి మంచం' అని ఎందుకు పిలుస్తూ, తిడుతూ ఉందో తెలుసుకోవాలంటే ఓసారి ఫ్లాష్ బ్యాక్ లోకి గుండ్రాలు తిప్పుకుంటూ వెళ్లితీరాల్సిందే.

సుందరి పుట్టిందీ, పెరిగిందీ అంతా పల్లెటూళ్ళోనే. సుందరి తన తల్లిదండ్రులకి ఒకే ఒక్క ఆడ సంతానం కావడం నుండి ఆమె ఆడింది ఆటగా, పాడింది పాటగా గడిచింది ఆమె బాల్యమంతా.

నీట్‌నెస్ అంటే అమిత ప్రాణం ఆమెకు.

ఆమెకు అత్యంత నేస్తురాలు పర్వతవర్ధని. వాళ్ళు బ్రాహ్మణులు. పర్వతవర్ధని వాళ్లది పెద్ద కుటుంబం. వాళ్లింట్లో పంతులుగారు, భార్య, నలుగురు పిల్లలు. ఇంకా కాటికి కాళ్లు చాపుకున్న పంతులుగారి ముసలితల్లి ఉండేవారు.

ఆ ముసలమ్మని అందరూ 'పంతులుగారి ముసలమ్మ' పిలిచేవారు.

పర్వతవర్ధని వాళ్లది అంత పెద్ద ఇల్లేం కాదు. ఒక గది, వంటిల్లు, వీధిలోకి ఒక వరండా... అంతే.

మధ్యవున్న గదిలో పాతకాలం నాటి పందిరి పట్టెమంచం ఉండేది. పగటిపూట వీధి వరండాలో ఎండ పొడ ఎక్కువగా వస్తుంది. అందుకని పగలల్లా పంతులుగారి ముసలమ్మ గదిలో మంచం మీదే కాలక్షేపం చేసేది. ఆ టైమ్‌లో ఆమె వాడుకునే వస్తురాజాలన్నీ ఆ మంచం మీదే పరుచుకుని కూర్చునేది. తలక్రింద పెట్టుకోవడానికి వాడే పాత గుడ్డలతో కుట్టిన బొంత, తలగడ, చినిగిపోయిన తాటాకు విసనకర్ర, మందులున్న కవరు... వగైరా వగైరా... చాలా చిందరవందరగా ఉండేది మంచం.

సంధ్యాహ్నం మూడయ్యేసరికి మంచం మీద సీను మారేది.

ఎండ తీవ్రత తగ్గగానే ఆ ముసలమ్మ వరండాలోకి చేరుకునేది. గదిలో మంచం మీద వర్ధని, మిగిలిన సోదరసోదరీమణులు అందరూ ఒక కునుకు తీసేవారు.

సాయంత్రం ఆరు, ఏడువరకూ ఇంచుమించు అదే దృశ్యం కానవచ్చేది. రాత్రి అయ్యేసరికి ఇంకొకరి సీక్వెన్స్ సిద్ధమయ్యేది.

మళ్లీ యథాప్రకారం ఉదయమవ్వగానే దాని మీద ముసలమ్మ రెడీ అయ్యేది.

ఇదంతా రోజూ చూసే సుందరికి చాలా చికాగ్గా అనిపించేది.

రోజులో సగం కన్నా ఎక్కువ భాగం బామ్మగారే ఆ మంచం మీద గడపడం వల్ల దానికి 'బామ్మగారి మంచం' అని నామకరణం చేసేసింది సుందరి.

అప్పటినుండే సుందరి ఓ గట్టినిర్ణయం తీసేసుకుంది. రేపొద్దున్న తనకి పెళ్లయిన తరువాత తను మంచాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ 'బామ్మగారి మంచం' కానివ్వకూడదని.

అప్పుడప్పుడు పర్వతవర్ధని కుటుంబం మీద జాలి కూడా పడేది.

''పాపం! పేదరికం... ఉన్నంతలోనే సర్దుకోవాలి'' అని సానుభూతి వెలిబుచ్చేది.

కొన్నాళ్లకి సుందరికి, ఫెళ్ళున పెళ్లయింది. అత్తవారింటికి కాపురానికి కూడా వచ్చింది.

తమ పడకగదిని ఎంతో అందంగా మంచాన్ని ఎంతో నీట్‌గా అలంకరించుకోవాలని ఎన్నో కలలు కన్న సుందరికి, తన ఆశలు ఆశలుగానే, కలలన్నీ కల్లలుగా మిగిలిపోనున్నాయని గ్రహించడానికి ఎంతో సమయం పట్టలేదు.

సుందరి అత్తవారిల్లు ఎంతో పెద్దది. కానీ రైలుపెట్టెల్లా వరుసగదులున్న ఇల్లు. పెరట్లోకి వెళ్లడానికి ఇంటి ప్రక్కనుంచి సన్నని సందుండేది. కానీ దీన్ని ఎవరూ పెద్దగా ఉపయోగించుకునేవారు కాదు.

ఇంట్లోని వారందరూ పగలంతా తమ గది గుండానే రాకపోకలు సాగించడంతో వారి ఏకాంతానికి ఎంతో ఆటంకం కలిగేది. కొత్తగా పెళ్లయిన సుందరి తమ ముద్దుముచ్చట్లకి అంతరాయం కలగడంతో ఎంతో నిరాశగా ఫీలయ్యింది.

కానీ, అత్తగారి దగ్గర ఉండే భయభక్తుల వలన సుందరికి నోరు మూసుకుని సర్దుకుపోక తప్పలేదు.

ఏదైతే జరగకూడదని సుందరి ఆశించిందో, అదే జరిగింది.

వరుస గదులవ్వటంతో...ఇంటికి వచ్చిన చుట్టాలందరూ తక్కున ఆ మంచం మీదే ఆసీనులయ్యేవారు. చాకలి ఇస్త్రీ బట్టలు తెచ్చినా, బావగారి కొడుకు స్కూల్ బ్యాగ్‌తో వచ్చినా, వాటన్నింటికీ ఆ మంచమే నెలవయ్యేది.

అందాల నగిషీలతో, మంచి టేకు కర్రతో..అలరారే ఆ పందిరి పట్టెమంచం, అడ్డమైన వస్తువులను కొలువుదీర్చే ఆసనమయ్యింది.

పూలపడవలా తీర్చిదిద్దాలన్న సుందరి మంచం, 'బామ్మగారి మంచం'గా పరిణమించడంతో సుందరి హతాశురాలైంది.

అయితే..ఇవన్నీ ఒకెత్తు, అదే ఊళ్ళో వుంటున్న చిన్నాడబిడ్డ మీనాక్షి ధాష్టికం ఒకెత్తు. ఊళ్లోనే ఉండటంతో మీనాక్షి రోజులో మూడొంతులు పుట్టింట్లోనే గడిపేది. గడిపితే గడిపెనుపో..ఆమె సంతానం చేసే మితిమీరిన అల్లరికి ఆ మంచమే వేదికయ్యేది.


వస్తూనే పిల్లలందరూ గభాలున ఆ మంచం మీదికే దూకేవారు.

వారి ఆటపాటలకీ, రన్నింగ్‌రేస్‌లకీ..కుస్తీపట్లకీ, తదితర జిమ్నాస్టిక్స్ అన్నింటికీ ఆ

మంచమే రంగస్థలమయ్యేది.

పగలంతా దానిమీద నానా రకంగాళీ జరగడం వల్ల సుందరికి ఆ మంచం మీద పడుకోవాలంటేనే మహాచీదరగా వుండేది.

ఒకవేళ పడుకోవలసి వస్తే, ఆ బెడ్‌షీట్ అన్నీ మార్చుకొని పడుకునేది.




భార్య పడుతున్న మనోవేదనను పసిగట్టగల సమర్థుడే వామనరావు. కానీ.. ఏమీ చేయలేని నిస్సహాయుడైనాడు.

ఓసారి.. ధైర్యం చేసి మీనాక్షితో పిల్లల్ని కంట్రోల్ చేయమని చెప్పి చూశాడు.

దానికి మీనాక్షి సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు.

కుంభవృష్టిగా కురిసిన ఆమె మాటల వర్షంలో, ఒక గడ్డిపోచలా కొట్టుకుపోయాడు వామనరావు.

ఆ తరువాత మరెప్పుడూ మీనాక్షినిగానీ, ఇంట్లో వారందరినీ కానీ వారించే వ్యర్థ ప్రయత్నం చేయలేదు వామనరావు.

మరేమీ చేయలేని సుందరి, వీలుండి సందు దొరికినప్పుడల్లా ఆ మంచాన్ని 'బామ్మగారి మంచం' అని కసిగా ఓ తిట్టు తిట్టుకునేది.

రోజుకి దరిదాపుగా ఓ పాతిక, ముప్పైసార్లన్నా ఆ పదం ఆమె నాలుక మీద నాట్యాలాడేది.

★ ★ ★

'ఢబ్' మన్న సౌండ్‌తో వాస్తవంలోకి వచ్చి పడింది సుందరి.

మీనాక్షి కొడుకు 'రాంపడు'గాడు ఇంట్లోకి అడుగిడుతూనే, ఆ మంచం పైకి 'హైజంప్' చేసిన ధ్వని అది.

అతన్ని అనుసరించింది ముద్దుల చెల్లెలు.

మీనాక్షి కూడా 'గృహప్రవేశం' గావించింది వారి వెనకాలే.

బామ్మగారి మంచాన్ని అధిరోహించారందరూ.

గట్టిగా ఓ వేడి నిట్టూర్పు విడిచి, ఆడపడుచుకి, ఆమె ముద్దుల సంతానానికీ మర్యాదలు కానివ్వడంలో మునిగిపోయింది సుందరి.

దీనంగా పతిదేవుని వైపు చూసింది. వామనరావు కూడా అదే ఎక్స్‌ప్రెషన్ ఇవ్వడంతో ''ఖర్మ ఖర్మ'' అంటూ నుదురుకొట్టుకుంది ఎవరూ చూడకుండా.

ఇలా.. మూడు మూతివిరుపులూ.. ఆరు ఆహోలుగా సుందరి జీవితం సాగిపోతోంది.

★ ★ ★

''సుందూ..సుందూ..'' మురిపెంగా పిల్చాడు వామనరావు.

కె.కె. భాగ్యశ్రీ

''హుం..'' భర్తవైపు ఓసారి నిస్సాకారంగా చూసి ముఖం అటు వైపునకు తిప్పుకుంది సుందరి.

''నామీద కోపమా?'' లాలనగా భార్యను తనవైపు తిప్పుకుంటూ అడిగాడు వామనరావు.

''నా మీద నాకే కోపం!'' కన్నీళ్లారగా చెప్పింది సుందరి.

''నీకో గుడ్ న్యూస్ చెప్తే ఏమిస్తావు నాకు?'' ఊరించాడు వామనరావు.

''అదేదో సెలవీయండి! అప్పుడాలోచిస్తాను'' గిరుక్కున అటు తిరుగుతూ అంది

సుందరి.

"నాకు..నాకు వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయ్యింది.."

అంతే స్ప్రింగ్‌లా లేచి కూర్చుంది సుందరి.

"నిజ్జంగా.." ప్రశ్నించింది మెరిసే కళ్లతో.

"అవునోయ్..వచ్చేవారమే మన ప్రయాణం. మా ఫ్రెండ్ గోవర్ధనానికి మంచి ఇల్లొకటి వెదికి ఉంచమని లెటర్ వ్రాసాను." అన్నాడు వామనరావు సుందరి బుగ్గన చిటికె వేస్తూ.

ఆనందం ఆపుకోలేక అమాంతం అతన్ని వాటేసుకుంది సుందరి.

"ఏమండీ! నాదో చిన్న కోరిక" గారంగా అంది సుందరి.

"ప్రియసఖి కోరిక కోరడమూ..నేను తీర్చకపోవడమూనా..ఏంటో చెప్పు!" అన్నాడు వామనరావు.

"ఈ బామ్మగారి మంచాన్ని ఇక్కడ వదిలేద్దామండీ..నాకు దీన్ని చూస్తే పెద్ద చిరాగ్గా ఉంది" వామనరావు ఛాతీమీద సుతారంగా రాస్తూ చెప్పింది సుందరి.

ఐస్పైపోయాడు అతగాడు. 'ఓస్ ఇంతేనా! ఈ చెత్తని ఇక్కడే వదిలేసి పోదాం. వైజాగ్ వెళ్లగానే అందమైన సన్‌మైకా మంచం, మంచి పరుపు కొనుక్కుందాం, సరేనా!" అన్నాడు సుందరిని వాటేసుకుంటూ.

"మావారెంత మంచివారో.." అంటూ సుందరి కూడా "డిటో డిటో" చేయబోతూండగా-

"ఛీ..యాక్..అత్తయ్య, మామయ్య.." అనుకుంటూ బయటకు పరిగెత్తాడు, అప్పుడే ఆ గదిలోకి అడుగుపెట్టిన రాంపండుగాడు.

వాడు చూసిన సినిమాల తాలూకు పరిజ్ఞానానికి, రంగు లద్ది..దానికి వాడి నైపుణ్యాన్ని మేళవించి మరీ తను గదిలో చూసిన సన్నివేశాన్ని వివరించాడు తల్లికీ..ఆమె తల్లికీ..

"నలుగురూ తిరిగే చోట..ఆ ప్రదర్శనలేమిటీ..సిగ్గు ఎగ్గు లేకపోతే సరి!" అత్తగారు ఏకిపారేసింది సుందరిని.

అవేం పట్టించుకోలేదు సుందరి. "ఇంకెన్నాళ్ళు? ఒక్కవారం రోజులు ఓపిక పడితే, ఈ రంధి తప్పించుకోవచ్చును. ఈ రైలు పెట్టెలకీ, ఆ బామ్మగారి మంచానికి టా..టా..చెప్పేయచ్చు" అనుకుంది హుషారుగా కూనిరాగం తీస్తూ.

వారంరోజులపాటు, ఉత్కంఠగా ఎదురుచూసింది సుందరి తమ ప్రయాణం కోసం.

అనుకున్న శుభతరుణం రానేవచ్చింది.

వామనరావు,సుందరి వైజాగ్‌లో కాపురం పెట్టేశారు.

ముచ్చటైన పొదరిల్లులా ఉన్న ఇంటిని చూసి పొంగిపోయింది సుందరి.

అన్నిసామాన్లు సర్దుకుని, బడలిక తీరాక మంచం, పరుపు, తలగడలు అన్నింటికీ ఆర్డరిచ్చారు.

సుందరమైన డబుల్‌కాట్, దానిమీదకి డన్‌లప్ పరుపు, పిల్లోలు ఇంటికొచ్చి చేరాయి నాలుగురోజుల్లో.

పడకగదిలో, కిటికీ దగ్గర ఆ మంచాన్నివేసి, మంచి బెడ్‌షీట్, పిల్లోకవర్స్‌తో మంచాన్ని అలంకరించింది సుందరి ఎంతో ఉల్లాసంగా.



రవీనా-కరీనా!

డేరింగ్ డాన్సర్ రవీనా
డిస్కోకి నువ్వు సరేనా
మాలాగే వెయిట్ చేస్తుంది
మద్రాసు మెరీనా
కాంపిటీషన్‌కొస్తుందేమో
చూసుకో కరీనా!

-గీతా శ్రీనివాస్

'హాయిహాయిగా జాబిల్లి', 'పగడాల జాబిలి చూడు', 'వెన్నెల రేయి ఎంతో చలిచలి' అనే సూపర్‌హిట్ శృంగార గీతాల్ని హాయితీరా పాడుకుంటూ పది రోజులు గడిపారు.

ఓనాడు వామనరావు ఆఫీస్‌కెళ్లాక తీరుబాటుగా పనులు పూర్తి చేసుకొని, కులాసాగా మంచం మీద వాలింది సుందరి.

రిలాక్స్‌డ్‌గా అటూ ఇటూ పొర్లింది.

'ఎలాగైతేనేం తన స్వప్నాలన్నీ సాఫల్యం చెందాయి. ఇంక ఈ మంచం 'బామ్మగారి మంచం'లా తయారవకుండా చూసుకోవలసిన బాధ్యత తనదే..' తీపికలలుకంటూ కళ్లు మూసుకుంది సుందరి.

దబదబ తలుపు చప్పుడు విని 'ఈవేళలో ఎవరూ చెప్మా?' అనుకుంటూ తలుపుతీసిన సుందరి కొయ్యబారిపోయి, కొండపల్లి బొమ్మలా నిలబడిపోయింది.

తలుపునకవతల మీనాక్షి, ఆమె భర్త ఏకాంబరం, వానరమూక.

"మావారికి ఈ ఊళ్లో ఏదో పనుందట. ఎన్నాళ్ళ నుండో వైజాగ్ చూడాలని నా కోరిక. సరే మీరెలాగూ ఇక్కడే వున్నారు కాబట్టి, ఆయనున్న నెలరోజులూ నేను, పిల్లలూ కూడా ఇక్కడే వుందామని!" దీర్ఘం తీస్తూ లోనికి అడుగుపెట్టింది మీనాక్షి.

నోటవమాట రాలేదు సుందరికి. ఆడపడుచు వచ్చిన షాక్ నుండి తేరుకోలేకపోతోందింకా.

మీనాక్షి రాక్షససైన్యం అంతా అప్పటికే, మంచం మీద చేరిపోయి, మర్కట చేష్టలు ప్రారంభించారు.

"హే..కొత్త మంచం..ఎంత బాగుందో!" అంటూ తనుకూడా మంచం మీదే బాసింపట్టు వేసుకుని తిష్టవేసింది మీనాక్షి.

క్షణాల మీద పూలతేరులాంటి డబుల్‌కాట్, 'బామ్మగారి మంచం'గా రూపుదిద్దుకోవడం చూసి కళ్లనీళ్ల పర్యంతమైంది సుందరికి.

★